క్లుప్తంగా

ప్రతీ ఒక్కరు కంప్యూటర్ విద్య నేర్చుకోవాలి



కంప్యూటర్ అందజేస్తున్న విజయలక్ష్మి

జగిత్యాల: ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ విద్య నేర్చుకోవాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం జగిత్యాలలోని మల్లేశం ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీ స్టడీ హాల్‌లో లైబ్రరీ మెంబర్‌షిప్ తీసుకుని క్రమంగా వచ్చిన వారికి ప్రతివారం కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టడీ సర్కిల్‌కు క్రమం తప్పకుండా వచ్చిన వారికి కేవలం రూ.1600 చెల్లిస్తే కంప్యూటర్ ఇవ్వడం అభినందనీయమని, ఇది పిల్లలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ అకాడమీలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ తదితర కోర్సులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఆది రమ, సునీత, శారద, కిరణ్, సుమన్ పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ రూ.లక్ష మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: బీసీ కులాలన్నింటికీ రూ.లక్ష మంజూరు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం డెప్యూటీ తహసీల్దార్ అనిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బీసీ కులాలన్నింటికీ రూ.లక్ష మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిరాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సామల్ల సతీశ్, యూత్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగధరి సురేశ్, నాయకులు విష్ణు, ఆనంద్ పాల్గొన్నారు.

రైతు డిపో ప్రారంభం



రైతు డిపో ప్రారంభిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన రైతు డిపోను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇందులో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ అంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్, యజమాని గడ్డం శేఖర్‌రెడ్డి, పూండ్ర జనార్దన్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



మొక్కలు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

మెట్‌పల్లి: హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత సిబ్బందికి సూచించారు. పట్టణంలోని రేగుంటలో ఉన్న నర్సరీని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిపై డివైడర్ల మధ్యలో పూలు, శివారు ప్రాంతాల్లో పండ్ల మొక్కలను నాటాలని సూచించారు. హరితహారంలో ప్రజలను భాగస్వాములను చేసి వార్డుల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ముజీబ్, గంగరాణి, అనిల్, జనార్దన్ తదితరులున్నారు.

సరస్వతీ విగ్రహం ఆవిష్కరణ

మెట్‌పల్లి: మండలంలోని కొండ్రికర్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. సర్పంచ్ ఆకుల రాజగంగు ఆధ్వర్యంలో దాతల సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఆవిష్కరించి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- అరకొర వసతులతో అవస్థలు
- 30 కేంద్రాలకు సొంత భవనాలు కరువు
- టీచర్లపైనే అద్దె భారం



అద్దె భవనంలో రాయికల్ అంగన్‌వాడీ కేంద్రం

రాయికల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రాయికల్ మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలు మెజార్టీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో వసతులు సరిగా లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులతో కేంద్రాలను నిర్వహిస్తుండటంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గర్భిణులు 675, బాలింతలు 486, 7 నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 2535, 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 1325 మంది ఉన్నారు. కేవలం 34 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 30 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 16 పాఠశాలల్లో విలీనం అయ్యాయి. అయితే అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం ఇచ్చే అద్దె డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదు. నెలకు రూ.1000 కంటే తక్కువగా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే రూ. 500 కు మిగతా మొత్తాన్ని అంగన్‌వాడీ టీచర్లు కలిపి భవన యజమానులకు చెల్లిస్తున్నారు.

అద్దె రేట్లు పెంచారు



మున్సిపాలిటీలో అద్దె భవనాల రేట్లను పెంచడంతో ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనాల్లో సౌకర్యాలు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి రూ.1000 రావడంతో అదనంగా మరో రూ.1500 వరకు కలిపి అద్దె చెల్లిస్తున్నాం. అంతేకాకుండా ఆయా లేకపోవడంతో ఆయా పని కూడా మేమే చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఏలిగేటి రజిత, అంగన్‌వాడీ కార్యకర్త

ప్రతిపాదనలు పంపించాం



రాయికల్‌లో సొంత భవనాలు లేని వాటి వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే భవనాల నిర్మాణం చేపడతాం. నిధుల మంజూరుకు సంబంధించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. ఆయా పోస్టులు ఖాళీలు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం.

– పద్మావతి, సూపర్‌వైజర్

కోరుట్లలో 2 కే రన్ విజయవంతం



కోరుట్లలో జెండా ఊపి 2 కే రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. మురళీకృష్ణ ఆలయం వద్ద 2 కే రన్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి 63 నంబర్ జాతీయ రహదారిపై నంది చౌరస్తా వరకు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలు విద్యాసంస్థలు, యువకులు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పీవీ నరసింహా రావు వెటర్నరీ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. నంది చౌరస్తా వరకు రన్ విజయవంతగా చేరింది. అనంతరం నంది చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు మెడల్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, కమిషనర్ అయాజ్, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై సతీశ్ కుమార్, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జగిత్యాలలో కార్పొరేట్ స్థాయి వైద్యం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రులు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం వేద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రం కావడం ఎంతో అదృష్టమని, దీంతో వైద్య సౌకర్యాలు మెరుగయ్యాయన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ సెక్రటరీ అజయ్, నవీన్, కూసరి అనిల్, బొడ్ల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలతో ఆర్థికాభివృద్ధి పొందాలి

జగిత్యాలరూరల్: మహిళా సంఘ సభ్యులు స్వయం ఉపాధి రుణాలతో ఆర్థికాభివృద్ధి పొందాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లిలో బాలాజీ స్వశక్తి సంఘ సభ్యులు గోనెపల్లి లావణ్యకు బ్యాంకు లింకేజీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి కోసం బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ రుణాలతో కొత్తగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో సీసీలు సంతోష్, రాజేందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కులం, ఆదాయం పత్రాల కోసం నిరుపేదల నిరీక్షణ



తహసీల్దార్ కార్యాలయంలో రద్దీ

వెల్గటూర్: మండల తహసీల్దార్ కార్యాలయంలో నిరుపేదలు కులము, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం తహసీల్దార్ ఆఫీస్ వద్ద బారులు తీరారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ కులాల్లో నిరుపేద వర్గాలకు రూ.1 లక్ష వరకు ప్రభుత్వసాయం అందిస్తోంది. దీనికి దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు ధృవీకరణ పత్రాల కోసం తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. రెండు రోజులు సెలవు దినాలు కావడం వల్ల సోమవారం ఒక్కసారిగా జనం ఆఫీస్ ముందు క్యూ కట్టారు. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉన్నా ధ్రువీకరణ పత్రాల అప్లికేషన్ ఫారంలపై సిబ్బంది సంతకాలు చేయడం లేదని ప్రజలు ఆరోపించారు. చివరికి సాయంత్రం వరకు పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

కొండగట్టు: మండలంలో ధాన్యం కొనుగోలు పూర్తయినట్లు ఏపీఎం దేవరాజం సోమవారం తెలిపారు. చెప్యాలలో 14,575 క్వింటాళ్లు,, గంగారం తండాలో 13,516 క్వింటాళ్లు,, తిప్పాయిపల్లిలో 13093 క్వింటాళ్లు,, కోనాపూరంలో 12,625 క్వింటాళ్లు, కొడిమ్యాల 8,505 క్వింటాళ్లు, అప్పారావు పేటలో 7,542 క్వింటాళ్లు, హిమ్మత్‌రావు పేటలో 7433 క్వింటాళ్లు, సూరంపేటలో 7,417 క్వింటాళ్లు, రాంసాగర్‌లో 7,295 క్వింటాళ్లు, చింతలపల్లిలో 5639 క్వింటాళ్లు, మొత్తం 1693 మంది రైతుల నుంచి 97,640 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించినట్లు ఏపీఎం తెలిపారు. కొనుగోలుకు సహకరించిన మండల ప్రజా ప్రతినిధులు అధికారులు, నిర్వహకులు సెర్ప్ సిబ్బంది రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాశీయాత్రికులకు సన్మానం



సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

కథలాపూర్: బీమారం మండలం మన్నెగూడెం, దమ్మన్నపేటకు చెందిన ముగ్గురు సైకిళ్లపై కాశీయాత్ర వెళ్లొచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సన్మానించారు. మన్నెగూడెం గ్రామానికి చెందిన ఆన్‌రెడ్డి రాజారెడ్డి, దమ్మన్నపేటకు చెందిన గాజుల సాంబయ్య, సాయికుమార్ సైకిళ్లపై 15 రోజుల క్రితం కాశీయాత్రకు బయలుదేరారు. సోమవారం గ్రామాలకు చేరుకోవడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాచర్ల సురేశ్, ఎంపీటీసీ రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మండల పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మల్యాల: మండలంలోని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వడ్లెపల్లి శశాంక్, కోశాధికారి బొమ్మకంటి గంగాధర్, ఉపాధ్యక్షులుగా వీరబత్తిని ప్రసాద్, కస్తూరి విశ్వనాథం, ప్రధాన సలహాదారుడిగా కొండబత్తిని గంగాధర్, సహాయ కార్యదర్శులుగా వీరబత్తిని గంగాధర్, బుదారపు గంగమల్లు, సలహాదారులు శ్రీరాముల రమేశ్, బొద్దుల మహేందర్, కార్యవర్గ సభ్యులుగా కొండబత్తిని నర్సయ్య, పెంట సురేశ్, జల్ల శ్రీనివాస్, అల్లె శంకర్, బూర్ల గణేశ్, అడ్లగట్ల లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దివ్యాంగుల మండల కమిటీ..

బుగ్గారం: దివ్యాంగుల మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు తాండ్ర రాజయ్య, నాయకులు మద్దునూర్ మహేశ్, అనంతుల శేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలమడుగు నరేందర్, ఉపాధ్యక్షుడిగా పెద్దనవేణి ఓదన్న, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, సలహాదారుగా ఆదె చంద్రయ్యను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో దివ్యాంగులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిర్మాణ బృందం కన్వీనర్‌గా సంజీవ్

మల్యాల: ఎమ్మార్పీఎస్ నిర్మాణ బృంద మండల కన్వీనర్‌గా నలువాల సంజీవ్, కోకన్వీనర్‌గా ముప్పారపు రవిని నియమిస్తూ ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా నక్క రాజయ్య, శనిగరపు తిరుపతి, మల్యాల నారాయణ, కొత్తూరి చంద్రయ్య, సిద్దెంకి లింగయ్య, మారంపల్లి లక్ష్మణ్, గుడిసె రవి, బొల్లి కిషన్, సైదల అంజయ్య, తైదల బాబు, చిర్ర మధును నియమించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చలో మిషన్ హైదరాబాద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిలుముల రాజయ్య, దూమాల గంగారం, బెజ్జంకి సతీశ్ పాల్గొన్నారు.

సెల్‌పాయింట్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: సెల్‌పాయింట్ పట్టణ నూతన కార్యవర్గాన్ని జిల్లా కమిటీ అధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యపు రమేశ్, ఉపాధ్యక్షుడిగా విఠల్, కార్యదర్శిగా పవన్‌కుమార్‌రెడ్డి,సంయుక్త కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా పెద్దిశివను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు భోగ వెంకటరమణ, వెల్గటూర్ మండల అధ్యక్షుడు మెరుగు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలు

ఇబ్రహీంపట్నం: పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేందుకు ప్రభుత్వం ఆయా మండలాల ఎమ్మార్సీ కార్యాలయాలకు పాఠ్యపుస్తకాలను పంపించింది. సోమవారం మండలకేంద్రంలోని ఎమార్సీ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. మండలంలోని 31 పాఠశాలలకు గాను 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 21,790 పుస్తకాలకు గాను 14,535 పాఠ్యపుస్తకాలు రాగా మిగతా 7,255 పుస్తకాలు రావాల్సి ఉందని ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు. వచ్చిన పాఠ్యపుస్తకాలను మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినూత్న నిరసన



శునకానికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయం వద్ద వినూత్నంగా శునకానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు ముందే విద్యార్థుల నుంచి 50 శాతం ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారి కనీసం చర్యలు చేపట్టడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి అంజి, రాకేశ్, ప్రశాంత్, వినీత్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. సోమవారం ఎంఈవోకు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మాడవేణి సునీల్ మాట్లాడుతూ పలు ప్రైవేటు పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పాఠశాలల్లో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి పాఠశాలలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భూముల వివరాలు తొలగింపు అన్యాయం



వినతిపత్రం అందిస్తున్న తండావాసులు

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్‌లో తమ భూముల వివరాలు తొలగించారని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తిమ్మాపూర్ తండాకు చెందిన గిరిజనులు ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందచేశారు. తిమ్మాపూర్ తండా శివారులోని సర్వే నంబర్ 300లో 2009లో సాగు చేసుకునేందుకు భూములు ఇచ్చి పట్టాదారు పాస్ పుస్తకంలో కూడా ఇచ్చారని, ఇప్పటికీ భూములు సాగు చేసుకుని పంటలు పండిస్తున్నామని విన్నవించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలతో బ్యాంకులలో పంట రుణాలను కూడ తీసుకుంటున్నామని , గత మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో సర్వే నంబర్ 300లో మా భూములను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆన్‌లైన్‌లో తొలగించడంతో 1బీ రాక బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇవ్వడం లేదని వెంటనే మా యొక్క భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 1బీ వచ్చేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో భూక్య కళావతి, గుగ్లావత్ మోతిలాల్, డాక్య నాయక్, కొత్తూరి దేవదాస్, భూక్య వాల్మీకీ బాయ్, గుగ్లావత్ చిలకమ్మ, జరుపుల గంగు బాయి, గుగ్లావత్ రవి, జరుపుల అమృత బాయి పాల్గొన్నారు.

తగ్గని ఎండ తీవ్రత

- ఎండలతో విద్యార్థుల ఇబ్బందులు
- పలు ప్రైవేట్ పాఠశాలల్లో నేటి నుంచి ఒంటిపూట బడులు

గొల్లపల్లి: వేసవి తీవ్రత ఏమాత్రం తగ్గకుండా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు.సోమవారం నుంచి అన్ని పాఠశాలలు ప్రారంభమయ్యాయి. తల్లిదండ్రులు తమ పిల్లల పాఠశాలలకు పంపేందుకు సిద్ధమయ్యారు. కానీ ఉష్ణోగ్రతలు అలాగే ఉండటంతో చిన్నారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నేటి నుంచి ఒంటి పూట బడులు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పూనుకున్నారు. ఉదయం 8:40 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు మాత్రం రెండు పూటలు కొనసాగనున్నాయి.ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటే పిల్లలను పాఠశాలకు పంపుతారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ పాఠశాలలకు పంపిన తగిన జాగ్రతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏపీలో ప్రభుత్వం ఒంటి పూట బడులు కొనసాగించేందుకు నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం రెండు పూటల బడులు కొనసాగుతాయని విద్యాశాఖ స్పష్టంచేసింది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఒంటిపూట బడి నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఏలాంటి ఆదేశాలు రాలేదని ఎంఈవో జమునాదేవి తెలిపారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు అందిస్తున్న జీపీ కార్మికులు

సారంగాపూర్: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తే నిరవధిక సమ్మెకు వెళ్తామని గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం బీర్‌పూర్ ఎంపీడీవో మల్లారెడ్డికి నోటీసు ఇచ్చారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని, గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం పూర్తిగా తొలగించాలని కోరారు. వీటిని పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఈ నెల 21 తరువాత ఎప్పుడైనా సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాజారంలో భగవద్గీతపై ప్రచారం

ధర్మపురి: మండలంలోని రాజారంలో సోమవారం లోక కల్యాణార్థం త్రైత సిద్ధాంత గ్రంథాలను, జ్ఞాన ధర్మ ప్రచారాన్ని చేశారు. జగిత్యాల జిల్లా త్రైతసిద్ధాంతకర్త ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీష్యులతో సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ఆది గురు తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు అవార్డు గ్రహిత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు ఆర్ రాజు, రాకేష్, ఎం రాజు, విక్రమ్ దీక్షిత్, సునిత, రవళి, స్వాతి, ఉమా, సంధ్యారాణి తదితరులున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

కథలాపూర్: బీమారం మండలం పసునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతీ పూజ చేసి అనంతరం చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ లచ్చ నాయక్, సూపర్‌వైజర్ రాధ, కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ టీచర్ కవిత తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఫసల్‌బీమా పథకం ప్రవేశపెట్టాలి

రాయికల్: సీఎం కేసీఆర్ రైతులకు ఫసల్ బీమా పథకం ప్రవేశపెట్టాలని రైతు ఐక్యవేదిక సంఘం నాయకులు క్యాతం సాయిరెడ్డి, మెక్కొండ రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి ఇంతవరకు డబ్బులు ఇవ్వడం లేదని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఫసల్ బీమా వంటి పథకాలు ప్రవేశపెట్టాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 45 మందికి గాను 44 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం



కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో హావర్లీ బేస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ సోమవారం తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 14వ తేదీలోగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీటీ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, కామర్స్, సివిక్స్ పోస్టులు, టీజీటీ విభాగంలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.